Kamsin ki Shadi Aur Islam
(Telugu)

# బాల్య వివాహాలు-ఇస్లాం

రచన

సుల్తాన్ అహ్మద్ ఇస్లాహి

అనువాదం

ముహమ్మద్ గౌస్‌ఖాన్

# విషయ సూచిక


1. బాల్య వివాహం - ఇస్లాం 4

2. అమ్మాయి పెండ్లి రజస్వలము తరువాత చెయ్యడమే ఉత్తమం 6

3. బాల్య వివాహం 7

4. చిన్న వయస్సు అమ్మాయితో సంయోగం- మగవారికి హానికరం 8

5. శారీరక, వైద్యపరమైన నష్టాలు 9

6. మానసిక నష్టాలు 12

7. బాల్య వివాహం అబ్బాయికి కూడా నష్టదాయకమే 12

8. దివ్యఖుర్ఆన్, హదీసు సూచనల ప్రకారం యవ్వనము, తెలివి తేటల తరువాత పెండ్లే సమంజసం 13

★ నవ యవ్వనపు వయస్సు 14

★ సామర్థ్యము, దాని ఆవశ్యకత 16

9. చివరి మాట 20

# 1. బాల్య వివాహం - ఇస్లాం

బాల్య వివాహాల సమస్య సమాజాన్ని ఒక రుగ్మతగా పీడిస్తోంది. బాల్య వివాహాల సమస్యలో అనేక చిక్కుముడులు ఉన్నాయి. వెనుకబడిన వర్గాలలో ఈ దురాచారం ఎక్కువగా కనబడుతుంది.. నేటి ఆధునిక కాలంలో కూడా నాలుగు సంవత్సరాలు పూర్తయిన బాలబాలికలకు పెళ్ళి చేస్తున్నారు.

పెండ్లి వయస్సు మగవారికి 21 సంవత్సరాలు, ఆడవారికి 18 సంవత్స రాలుగా భారత ప్రభుత్వం నిర్ణయించింది. దానిని ఉల్లంఘించడం నేరం. ఉల్లంఘనకు పాల్పడిన వారందరూ శిక్షార్హులే. కాని, చట్టపరమైన నిబంధనలు ఎన్ని ఉన్నా, దేశంలోని అనేక ప్రాంతాలలో ముఖ్యంగా విద్యాజ్ఞానాలు సోకని గ్రామీణ ప్రాంతాలలో ఈ బాల్య వివాహాల సంప్రదాయం సర్వసాధారణమై పోయింది. లభిస్తున్న సమాచారం ప్రకారం ఒక్క రాజస్థాన్‌లోనే వేలమంది బాలబాలికలను ఈ మధ్య కాలంలోనే పెళ్ళిళ్ళు చేశారు. బాల్యవివాహాలు ఎంత అనర్థదాయకమో అమాయక ప్రజలు అర్థం చేసుకోవడానికి చాలా కాలం పట్టేలా ఉంది. వివరణ కోసం 1989 మే నెల 11వ తేదీ (1409 షవ్వాల్ నెల 5వ తేదీ)నాటి ఖౌమీ ఆవాజ్ దినపత్రికలోని 'రాజస్థాన్‌లో బాల్యవివాహాల ప్రోద్బలము' అనే అంశాన్ని చూడండి). అలాగే 1989 మే నెల 11వ తేదీ నాటి Indian Express దినపత్రికలో Hundreds of Child marriages on Tej అనే అంశాన్ని చూడండి.

నిమ్నకులాల ప్రజలు మరింత అణగారి పోవడానికి ఈ బాల్య వివాహాల దురాచారం కూడా కారణమయ్యింది. ఉన్నత వర్గాల వారు ఆ విధంగా తమ ప్రాబల్యాన్ని నిలుపుకోడానికి కూడా ఇది తోడ్పడింది.

బాల్యవివాహాల దురా చారంలో కూరుకుపోయిన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా పైకెదగలేక పోయారు. అంతేకాదు, తమ బతుకులు ఇంతే అన్న ఆత్మన్యూనతా భావానికి కూడా గురయ్యారు. ఆ విధంగా ఈ దురాచారాలు నిమ్నవర్గాలు అణగిమణగి ఉండేలా చేశాయి. ఈ దురాచారాల ప్రభావం భారత ముస్లిములపై కూడా పడింది. ముస్లిముల్లో కూడా బాల్యవివాహాల దురాచారం అక్కడక్కడా కనబడుతోంది.

భారతదేశం వైజ్ఞానికంగా, సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించి నప్పటికీ సమాజంలో బాల్య వివాహాల దురాచారం కొనసాగుతూనే ఉంది. బాల్యవివాహాల గురించి ఇస్లాం ఏమని బోధిస్తుందో తెలుసుకోవలసిన అవ సరం మనందరిపై ఉంది. ఇస్లాం ధర్మం బాల్య వివాహాలను ఇష్టపడదు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో తప్పనిసరి పరిస్థితులలో ఒక మినహాయింపుగా అను మతి మాత్రం ఉంది. ఇస్లాం బాల్యవివాహాలను ఎంతమాత్రం ఇష్టపడని ధర్మం.

ఇస్లాం స్వాభావికమైన ధర్మం, మనిషి ఆచరణకు అనుకూలమైన ధర్మం. ఒక్కోసారి కుటుంబ పరిస్థితుల కారణంగా చిన్న వయస్సులోనే పెండ్లి జరిపించవలసి వస్తుంది.

ఇలాంటి వివాహాలను ఇస్లాం ధర్మం ప్రోత్సహించదు, ఇంకా వాటిని ఇష్టపడదు. దీనికి సంబంధించి ఖచ్చిత ఆదేశాలు ఖుర్ఆన్, హదీసుల్లో ఉన్నాయి. ఇస్లాం అన్ని విధాలుగా బాల్య వివాహాలను నిరుత్సాహపరిచింది.

ఎవరికయినా సంతానం కలిగితే, వారికి మంచి పేరు పెట్టాలి. మంచి విద్యాబుద్ధులు నేర్పాలి. యుక్తవయస్సుకు చేరుకోగానే వివాహం చెయ్యాలి. యుక్త వయస్సుకు చేరుకున్నాక వారికి ఇంకా పెండ్లి చెయ్యక పోవడం వల్ల ఏదయినా పాపం వారితో జరిగిపోతే, ఆ పాప ఫలం తండ్రిపై ఉంటుంది.

తౌరాతు గ్రంథంలో ఇలా ఉంది: ఎవరి అమ్మాయి యుక్త వయస్సు పొంది, ఆమె పన్నెండు సంవత్సరాలకు చేరుకుంటుందో, ఆమె పెండ్లి జరగక

పోవడం వల్ల ఏదయినా పాపం జరిగిపోతే, ఆ పాప ఫలం (ఆమె తండ్రిపై) ఉంటుంది.

## 2. అమ్మాయి పెండ్లి రజస్వల తరువాత చెయ్యడమే ఉత్తమం

తప్పనిసరి పరిస్థితుల్లో ఇస్లాం బాల్య వివాహాలకు అనుమతిస్తుందని కొన్ని వివరణలను బట్టి తెలుస్తుంది. అమ్మాయిలు పూర్తి పరిపక్వత (యుక్త వయస్సు) పొందిన తరువాతనే వారి పెండ్లి జరగాలి. ఇమామ్ షాఫయీ, వారి అనుచరులు ఇలా తెలిపారు:

అమ్మాయి పెండ్లి, ఆమెకు యుక్త వయస్సు రాక ముందే ఆమె అనుమతి లేకుండా జరపడం ఆమె తండ్రి, తాతగారికి సమంజసం కాదు. అలా చెయ్యడమంటే ఆమెకు ఇష్టంలేని బంధంలో ఆమెను బంధించడమే అవుతుంది.

ప్రవక్త కాలం నాటి సహచరులే కాక మరికొంత మంది కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవించారు.

అమ్మాయి పెండ్లి, ఆమె యుక్త వయస్సుకు ముందు జరపడం సమంజసం కాదు. దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

**"..........మీలో ఎవరు వివాహం లేకుండా ఒంటరిగా ఉంటున్నారో; మీ స్త్రీ పురుష బానిసలలో ఎవరు గుణవంతులో, వారి వివాహాలు చేసి వేయండి." (నూర్-32)**

ఉత్తమమైన మంచి నికాహ్ గురించి హజ్రత్ షాహ్‌వలీ అల్లాహ్ ముహద్దిస్ దహెల్వీ (రహ్మ) కూడా ఇదే విషయాన్ని ఇలా తెలిపారు. 'పెండ్లి కాని అమ్మాయితో నికాహ్ జరిపించడం సమంజసం. అయితే, యుక్త వయస్సు లేని అమ్మాయి కారాదు. అమ్మాయి తప్పక బుద్ధీ జ్ఞానాలు, యవ్వనము పొంది ఉండాలి.

## 3. బాల్య వివాహం

ఇమాం మాలిక్ (రహ్మ), ఇమాం షాఫయీ (రహ్మ), ఇమాం అబూ హనీఫా (రహ్మ)ల ప్రకారం– ' ఈ విషయంలో అమ్మాయి లైంగిక పరమైన బాధ్యతను మోయగలిగి ఉండాలి'. మొండిలెక్కగా వయస్సును నిర్ణయించడం సరికాదు.

అంటే శారీరకంగా ధృఢంగా ఉండి, ఆరోగ్యంగా ఉండాలి. ఈ విషయాలన్నీ వదిలేసి కేవలం ఒక్క నిర్ణీత వయస్సును పరిగణలోకి తీసు కోవడం సరైనది కాదు. అసలు విషయం ఏమిటంటే– అమ్మాయికి గర్భాన్ని ధరించగలిగే ఓర్పు కలిగి ఉండాలి. దీనివల్ల ఆమెకు ఎలాంటి నష్టమూ జరుగ రాదు.

సంభోగంలో పాల్గొనలేని బాల్య కన్య వివాహం జరిపించడం సరైనది కాదు' అని ఇబ్నే షబ్రమ గారి ద్వారా తహావి ఇలా రాశారు: 'బాల్య కన్య యవ్వనము పొందక ముందే తండ్రీ ఆమె వివాహాన్ని జరిపించరాదు.

ఇబ్నె షబ్ర అభిప్రాయాన్ని ఇమాం తహావీ ఇలా తెలిపారు. సాధార ణంగా చిన్న వయస్సు అమ్మాయి సంభోగానికి యోగ్యమైనది కానప్పుడు ఆమె పెండ్లి చెయ్యడం సరైనది కాదు.:

ఇమాం గజాలీ (రహ్మ) తన 'షహ్రహ్ అఫాఖ్ తస్నీఫ్", అహయా ఉలూముద్దీన్"లో వివాహం సంబంధ బాంధవ్యాలను వివరిస్తూ గర్భాధారణ సంబంధం కొరకు ఆటంక మయ్యే కారణాలను కూడా వివరంగా తెలియ జేశారు. ఈ ఆటంకాలన్నింటినీ ఖుర్ఆన్, హదీసులలో పరిశీలించి, వీటిని 19 భాగాలుగా విశద పరిచారు. నికాహ్‌ను ఆటంకపరిచే 17, 18వ భాగాలు ఇలా ఉన్నాయి.

(17వ భాగం) భర్త కాబోయే వ్యక్తి చిన్న వయస్సులో ఉంటే, అతను యుక్త వయస్సు పొందిన తరువాతే అతని నికాహ్ సమంజసమవుతుంది.

(18వ భాగం) ఆమె వయస్సు తక్కువగా ఉంటే, ఆమె యుక్త వయస్సు పొందిన తరువాతే ఆమె నికాహ్ సమంజసమవుతుంది.

బాల్య వివాహాల విషయంలో ఇస్లాం వైఖరి ఏమిటో దీనిని బట్టి అంచనా వేయవచ్చు. ఇస్లాం ఈ ద్వారాన్ని తెరచి ఉంచినా దాని చుట్టూ ఎన్నో హద్దుల (ఎల్లల)ను ఉంచింది.

## 4. చిన్న వయస్సు అమ్మాయితో సంయోగం - మగ వారికి హానికరం

బాల్యవివాహాలను పూర్తిగా తగ్గించడానికి ఇస్లామీయ పరిశోధకులు ఎంతో ప్రయత్నం చేశారు. ఈ విషయమై చిన్న వయస్సు అమ్మాయి తో సంయోగంలో పాల్గొనడం ఆరోగ్యపరంగా మగవారికి ఎంతో హానికరమని చెప్పడం జరిగింది. వైవాహిక సంబంధంలో ఏ అంశాలను గౌరవించాలో ఇంకా పురుషులు ఏ స్థితిలో సంయోగంలో పాల్గొనడం ఆరోగ్యపరంగా మంచిదో కూడా తెలుపబడింది. అల్లామా ఇబ్నె ఖయ్యూమ్ (రహ్మ) ఇలా తెలిపారు:

"వృద్ధ స్త్రీతో, సంయోగంలో పాల్గొనలేని చిన్న వయస్సు అమ్మాయితో సంభోగం జరుపరాదు."

అరబ్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు హారిస్ బిన్ కలదహ్ చివరి క్షణాల్లో ఉన్నప్పుడు ప్రజలు ఆయన దగ్గరికి చేరి 'ప్రజలందరూ గుర్తుంచుకునే ఏదయినా విషయం మీ అనుభవంలోఉంటే తెలపండి' అని అన్నారు. హారిస్ అన్నిటికంటే ముందుగా తెలిపిన విషయం ఏమిటంటే-

'ఈడు కలిగి యవ్వనం పొందిన స్త్రీలను మాత్రమే వివాహమాడండి.'

అలాగే ఒక రోజు ఒక ప్రముఖ వైద్యుడు చివరి క్షణాల్లో ఉన్నప్పుడు ఏదయినా ఒక ముఖ్య ఉపదేశాన్ని తెలుపమని ఆదేశించాడు. రాజుతో ఇతను కూడా తన తొలిమాటగా ఇదే అన్నాడు.

"యవ్వనం పొందిన స్త్రీలనే వివాహమాడండి' వైద్యపరంగా అన్నిటి కంటే లాభదాయకమైన, ఆరోగ్యపరమైన సంయోగం గురించి ఇలా తెలుపబడింది.

అన్నిటికంటే లాభదాయకమైన, ఆరోగ్యపరమైన సంయోగపు స్థితి ఏమిటంటే- "సంభోగపు నిజమైన కోరిక ఉండాలి. యవ్వనం పొందిన, అందమైన స్త్రీతో జరగాలి. శాస్త్రీయ, పవిత్రమైన పద్ధతి ఉండాలి. ఇంకా యవ్వనపు వయస్సు కలిగి ఉండాలి.

## 5. శారీరక, వైద్యపరమైన నష్టాలు

దీనివల్ల శారీరక, వైద్యపరమైన నష్టాలు అందరికంటే అమ్మాయిలకే చాలా ఎక్కువ. అమ్మాయి శారీరక ఎదుగుదల పద్దెనిమిది సంవత్సరాల వరకు ఉంటుందని ఆధునిక వైద్య- పరిశోధనల వల్ల తెలుస్తుంది. అమ్మాయి పదిహేను, పదహారు సంవత్సరాల వరకు తప్పకుండా యుక్తవయస్సుకు చేరుకుంటుంది. కాని యోని, అండాశయపు ఎదుగుదల పద్దెనిమిది సంవత్సరాలవరకు జరుగుతుంది. ఒకవేళ అమ్మాయి పద్దెనిమిది సంవత్సరాల లోపు తల్లి అయినట్లయితే ఆమెకు అనేక నష్టాలు వాటిల్లుతాయి.

1. అమ్మాయి శారీరక ఎదుగుదల నిలిచిపోతుంది.
2. పద్దెనిమిది సంవత్సరాల వయస్సులో బిడ్డకు జన్మనిచ్చే యోని, అండాశయం వంటి అవయవాల ఎదుగుదల పూర్తి కాదు. దీనివల్ల గర్భాశయం పడిపోతుంది. తల్లి కావడంలో అనేక చిక్కులు ఎదురవుతాయి.
3. పద్దెనిమిది సంవత్సరాల లోపు పొత్తికడుపు ఎదుగుదల పూర్తికాదు. దీనివల్ల శిశువు తల పెద్దదైపోతుంది. ఇది కాన్పులో అడ్డం తిరగడం వల్ల లోపలి అవయవాలకు నష్టం వాటిల్లుతుంది. దీనివల్ల మూత్రాశయంలో బలహీనత ఏర్పడుతుంది.

4. లేత వయస్సులో సంయోగం వల్ల యోని ప్రక్కలలో క్యాన్సర్ ఏర్పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈ క్యాన్సర్ మన భారతదేశ స్త్రీలలో చాలా ఎక్కువగా ఉంది.[1]
5. ఇలాంటి పెండ్లి జరిగినప్పుడు సాధారణంగా గర్భం చాలా త్వరగా నిలిచిపోతుంది. దీనివల్ల స్త్రీ ఆరోగ్యం క్షీణించి, వృద్ధాప్య ఛాయలు త్వరగా ఏర్పడుతాయి.[2]
6. పద్దెనిమిది సంవత్సరాల లోపు తల్లికి పిల్లలు చాలా బలహీనంగా జన్మిస్తారు.
7. అనారోగ్యంగా, తక్కువ బరువుతో పుట్టిన శిశువులు ఎక్కువగా మరణిస్తారు.[3]

---

1. ఖాతూనె మష్రిఖ్ మాసపత్రిక, ఢిల్లీ ఆగస్టు 1987, పేజి. నెంబర్ 34, ప్రకాశకులు భారత ప్రభుత్వం, పి.బి.నెం. 5460, న్యూఢిల్లీ.
2. పెండ్లికి సరైన వయస్సు హిందీ ఫోల్డర్, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ, భారతప్రభుత్వం- 1987 ఏప్రిల్.
3. ఖాతూనె మష్రిఖ్, వెనుకటి సూచన. మన భారత దేశంలో సంభవించే శిశుమరణాలలో అధికభాగం చిన్న వయసులో జరిగిన పెండిండ్ల వల్లేనని తెలుస్తుంది. ఈ మధ్య జరిగిన నూతన సర్వే ప్రకారం జాతీయ సగటు వేయిమందిలో 105 మంది శిశువులు కాగా, దీనికి భిన్నంగా మధ్యప్రదేశ్‌లో 119, ఉత్తరప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాలలో 213మంది శిశువులు మరణించారు. ప్రాథమిక విషయాలను బట్టి శిశుమరణాలలో ఎక్కువగా పద్దెనిమిది సంవత్సరాలకంటే తక్కువ వయస్సు స్త్రీలకు పుట్టిన వారేనని తెలుస్తుంది. వీరికంటే రెండు మూడు రెట్ల మంది స్త్రీలు సరైన ఆహార విషయంలో బాధపడుతున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, కర్ణాటక, మహారాష్ట్రలలోని 32 జిల్లాలోని 800 గ్రామాలలో సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సర్వేని Family planning Foundation వారు జరిపారు. జనాభా లెక్కల ప్రకారం 29నుంచి 58శాతం బీద, బలహీన వర్గాల

8. ఈ వయస్సు కంటే ముందు రొమ్ముల ఎదుగుదల పూర్తికాదు. ఈ వయస్సు తల్లి దగ్గర తగినన్ని పాలు ఉండవు.[4]

అలాగే ఉత్తరప్రదేశ్‌లోని కొండ ప్రాంతాలలో 71 శాతం, కర్ణాటకలోని గ్రామీణ ప్రాంతాలలో 77 శాతం, ముంబైలోని గుడిసెలలో నివసించే వారిలో 76 శాతం ఇలాంటి పెండ్లిండ్లు జరుగుతున్నాయి. 18 సంవత్సరాల లోపు గర్భవతులయ్యేవారు మధ్యప్రదేశ్‌లో 50-58 శాతం, కర్ణాటక, ముంబైలలో దాదాపు 48 శాతం, ఒరిస్సా, కర్ణాటకలలోని ప్రాంతాలలో దాదాపు 29-33 శాతం ఉన్నారు. ఈ సర్వేలో అనేక సంస్థలు ఈ ఫౌండేషన్‌కు సహకరించాయి. దీనివల్ల లక్షా పదివేల ఇండ్లు, 25వేల మంది 2సంవత్సరాలలోపు బిడ్డలున్న తల్లులను కుటుంబ అభివృద్ధి సంక్షేమశాఖ సభ్యులు కలిశారు.

తక్కువ ఆదాయం ఉన్న వర్గాలలోనే తక్కువ బరువు ఉన్న శిశువుల జననం ఎక్కువగా ఉంటోంది. పేదరిక కుటుంబాలలో పిల్లల మరణరేటు రెండు రెట్లుగా ఉంది. వీరి నెలసరి ఆదాయం 500 రూపాయల కంటే తక్కువగా ఉంది. పేదరికం వల్ల పెండ్లిండ్లు త్వరగా జరిపిస్తారు. అయితే పిల్లల పోషణ సరిగా ఉండదు. జన్మించక ముందు, జన్మించిన తరువాత సరైన రక్షణ లేకపోవడం వల్ల పిల్లలు పెద్దసంఖ్యలో నష్టపోతున్నారు. పర్యవసానంగా ప్రజలు ఇంకా ఎక్కువమంది సంతానం కోసం పాకులాడుతున్నారు. సర్వేలు ఈ Vicious circleను ఎంతోపెద్దదిగా చేసి చూపెడుతున్నాయి. వీటి వివరణాత్మక పరిశోధనలు ఇంకనూ జరగుతున్నాయి. వివరణ - ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రిక, న్యూఢిల్లీ 28 డిసెంబర్ 1987. రిపోర్టు- 'చిన్న

అమ్మాయిల పెండిండ్లు 18సంవత్సరాల లోపు జరిగిపోతున్నాయి. అదే సమయంలో వారు గర్భాన్ని కూడా ధరిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఆడపిల్లలపెండ్లిండ్లు 90 కంటే ఎక్కువ శాతం 18 సంవత్సరాలలోపే జరుగుతున్నాయి.

4. 'పెండ్లికి సరైన వయస్సు' (హిందీ ఫోల్డర్)

వయస్సులో పెండ్లి శిశువు మరణానికి కారణం' (Early marriage cause of child mortality) ప్రపంచ దేశాలన్నింటిలోను మన దేశంలోనే స్త్రీల క్యాన్సర్ ఎక్కువగా ఉండటానికి కారణం- అధిక సంతానం, పోషకాహార లోపం, లేత వయస్సు పెండ్లిండ్లేనని తెలుస్తుంది. వివరణ కోసం - ఇండియన్ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ 28 మార్చి 1989. అంశం- లేత వయస్సు వివాహాల వల్ల గొంతు క్యాన్సర్ (Early Marriage causes cervical cancer)

## 6. మానసిక నష్టాలు

ఆరోగ్యం సహకరించక, వ్యాధి శాశ్వతమైపోతే ఏవో కొన్ని సమయాలలో తప్ప మనిషి బుద్ధి కూడా అనారోగ్యం పాలయిపోతుంది. అందువల్ల సాధారణంగా పలుమార్లు పెండ్లికి ముందు, తరువాత వీటి ప్రభావం వలన అమ్మాయి వ్యక్తిత్వం కుచించుకొని పోయి ఉంటుంది. తన సామర్థ్యాలను పూర్తిస్థాయిలో బహిర్గతం చేయజాలదు. అమ్మాయి ఒకవేళ చదువుకుంటుంటే లేదా ఏదయినా పని నేర్చుకుంటుంటే అవన్నీ ఆగిపోతాయి.

## 7. బాల్యవివాహం అబ్బాయికి కూడా నష్టదాయకమే

బాల్యవివాహం మానసికంగా అబ్బాయికి కూడా ఏమాత్రం తక్కువ నష్టదాయం కాదు. యవ్వనపు ప్రారంభ దశ, దాని వెంటనే ప్రారంభమయ్యే దశ మనిషికి ఎంతో విలువైనది, కోమలమైనది. ఈ దశలో మనిషి దేనినయితే తన ధ్యేయమని తలపోస్తాడో దానికోసం మనస్ఫూర్తిగా తపిస్తే దానిని సాధించడంలో అతను సఫలీకృతం అవుతాడు. అదేవిధంగా ఈ దశలో దేనిపైనయితే అశ్రద్ధ కలుగుతుందో, ఇంకా మనిషి దానిని మరిచిపోదలిస్తే అనేక సమయాలలో అతను దానిని శాశ్వతంగా మరిచిపోతాడు.

యవ్వనంలో నేర్చుకున్న విద్య రాతిపై చిత్రీకరించినటువంటిది. అలాగే వయస్సు మీరిపోయిన తరువాత నేర్చుకున్న విద్య నీటిపై గీచిన గీతలాంటిది.

మనిషి పెండ్లి, వివాహం వంటి సంకటము(చిక్కు)లకు దూరంగా ఉండి ఏదో కొంత సాధించినప్పుడే పరిపూర్ణత పొందగలడు. మనిషి ముందుగా తనకోసం తాను కొంత పునాది వేసుకోవాలి. ఆ తరువాతే వైవాహిక జీవితంలోకి వెళ్ళాలి.

ముఖ్యంగా ఈనాటి పోటీతత్వం (Competition), ప్రత్యేక శ్రద్ధ (Specialisation) చూపించే ఈ కాలంలో విద్యకు ఎంత ప్రాము ఖ్యత ఉందో చెప్పాల్సిన అవసరమే లేదు. నేటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మనిషి తన కాళ్ళపై తాను నిలబడి, భవిష్యత్తు కోసం కొంత కూడగట్టుకున్న తరువాతనే వివాహం చేసుకోవడం మంచిది. అప్పుడే మనిషి ఇంటికి సంబంధించిన విషయాలు, వైవాహిక బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలడు. ముఖ్యంగా ఇస్లాం దృక్పథంతో చూసినట్లయితే దీనికి ఇంకా ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎంతో ప్రశంసించదగిది. ఎందుకంటే పెండ్లి తరువాత భార్యాబిడ్డల అన్న పానీయాలు, పోషణ బాధ్యత, వారి భద్రత అంతా కేవలం భర్త, తండ్రి పైన్నే ఉంటుంది.

## 8. దివ్యఖుర్ఆన్, హదీసు సూచనల ప్రకారం యవ్వనం, తెలివితేటలు తరువాతి పెండ్లే సమంజసం

పురుషుల పెండ్లికి యోగ్యమైన వయస్సు ఏమిటి? ఇంకా ఏ వయస్సులో వారు వైవాహిక సంబంధాన్ని ఎంచుకోవాలి? దీనిని మహ నీయులు ముహమ్మద్(స) గారి ఈ ప్రవచనం పరిష్కరిస్తుంది. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి)గారు ఉల్లేఖించారు.

"యువకుల్లారా! మీలో వివాహ బాధ్యతల్ని నెరవేర్చే శక్తిగలవారు తప్పక వివాహం చేసుకోవాలి. ఎందుచేతనంటే, వివాహం దృష్టిని కిందికి వాలేలా

చేస్తుంది. మర్మస్థానాన్ని రక్షిస్తుంది. వివాహ బాధ్యతల్ని నెరవేర్చేశక్తి లేనివారు అప్పుడప్పుడు రోజా (ఉపవాసవ్రతం)ని పాటించాలి. అది కామాన్ని నిగ్రహింప జేస్తుంది."

## నవయవ్వనపు వయస్సు

"నవ యవ్వనపు వయస్సు' ఎంత? అనేది ఆలోచించదగ్గ విషయం. యవ్వనంలో నవయవ్వనపు వయస్సు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఉంటుంది? ఇమాం నూవీ (రహ్మ), హజ్రత్ ఇమాం షాఫయీ(రహ్మ) ఇంకా వారి అనుచరులు ఈ విషయం గురించి ఇలా తెలిపారు.

ముప్ఫై సంవత్సరాల కంటే తక్కువ వయస్సుగల వాడు 'నవ యువకుడు'

నవ యువకుని వయస్సు విషయంలో అనేక మంది పెద్దలు తమ అభిప్రాయాలను తెలిపారు. హాఫిజ్ ఇబ్నెహజర్ (రహ్మ) దానిని వివరిస్తూ ఇలా రాశారు.

ముప్ఫై సంవత్సరాలు పూర్తయిన వ్యక్తిని 'నవ యువకుడు' అంటాము. షాఫయీ కూడా ఇదే విషయాన్ని వ్యక్తపరిచారు. ఖుర్ఆబీ తెలిపిన విషయం ఏమిటంటే - పదహారు సంవత్సరాల వరకు పూర్వకౌమార, ముప్ఫై రెండు సంవత్సరాల వరకు యవ్వన దశ, ఆ తరువాత నడివయస్సు దశ, ఇదే విషయాన్ని జమ్‌ఖష్‌రీ ముప్పై రెండు సంవత్సరాల వరకు యవ్వన దశ' అని తెలిపారు. ఇబ్నెషాస్ మాలికి ప్రకారం ఇది నలభై సంవత్సరాలు. ముప్ఫై సంవత్సరాలకు పైబడకుండా ఉండే దశే నవ యవ్వనపు దశ అని నూవీగారు ఎంతో స్పష్టంగా తెలియజేశారు. నలభై సంవత్సరాలకు చేరుకుంటే నడి వయస్కుడవుతాడు. ఆ తరువాత ముసలివాడు. రూయానీ, మరికొందరి అభిప్రాయం ప్రకారం ముప్ఫై సంవత్సరాలు పైబడ్డవారు ముసలివారు (వృద్ధులు). ఇబ్నె ఖతీబ దీనికి ఇంకాస్త పెంచుతూ యాభై సంవత్సరాలు అని

అన్నారు. అబూ ఇస్‌హాఖ్ అస్ఫరాయిని తన సహచరులతో 'ఈ విషయంలో అసలు పరిష్కారం అనేది భాష, తల్లదండ్రుల సమస్య వారి స్వభావం (గుణం)ను బట్టి వేర్వేరుగా ఉంటుంది.

ఈ వివరాలను బట్టి నవ యవ్వనపు వయస్సు ముప్పై సంవత్సరాలని తెలుస్తుంది. ఇమాం నూవీహ్(రహ్మ)గారు అన్నిటి కంటే ఇదే మేలయినదిగా పేర్కొన్నారు. కాబట్టి ఈ విషయమే అన్నిటి కంటే మేలయినది, వాస్తవమైనది. హదీసు ద్వారా తెలిసే విషయం ఏమిటంటే, యవ్వన దశ పదిహేను సంవత్సరాల నుండి ప్రారంభమవుతుంది. అప్పటినుండి పెండ్లి చేసుకోవచ్చు. అబ్బాయికి ఈ సమయం నుండే స్వప్న స్కలనం అవుతుంది. ఆ తరువాత పెండ్లీడు వస్తుంది. దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా తెలుపబడింది.

'అనాధులకు పెళ్ళిఈడు వచ్చేవరకు వారిని అజమాయిషీ చేస్తూ ఉండండి.'

దీనిని అనుసరించి జలాలీన్ సాహెబ్ గారు ఇలా తెలిపారు. ఇమాం షాఫయీ(రహ్మ) కూడా ఇదే విషయాన్ని తెలిపారు.

(అనాధులకు పెళ్ళీడు వచ్చే వరకు వారిని అజమాయిషీ చేస్తూ ఉండండి) అంటే పెళ్ళి యోగ్యత వచ్చేవరకు. ఇది ఇమాం షాఫయీ (రహ్మ) దగ్గర అబ్బాయి పదిహేను సంవత్సరాలు పూర్తి చేసుకోవడం.

ఇమాం షాఫయీ (రహ్మ) గారి ఈ వాక్కును మహాప్రవక్త ముహమ్మద్ (స) గారి ఈ ప్రవచనం బలపరుస్తుంది. హజ్రత్ ఆయిషా సిద్దిఖా(రజి), ఇతర అనేకమంది అనుచరుల ఉల్లేఖనం ప్రకారం ఆయన(స) ఇలా తెలిపారు.

నవ యవ్వనపు వయస్సు పదహారు సంవత్సరాల నుండి ప్రారంభమవుతుంది. ముప్పై సంవత్సరాల వరకు ఉంటుంది. వీటి మధ్యకాలం పద్నాలుగు సంవత్సరాలు అవుతుంది. ఈ విషయంలో మహనీయులు ముహమ్మద్ (స) గారి మరో ప్రవచనం.

'వ్యవహారములలో అన్నిటికన్నా ఉత్తమమైన విధానం మధ్యస్థ మార్గం. దీని ఆధారంగా చూసినట్లయితే పద్నాలుగు సంవత్సరాలలో సగం

ఏడు సంవత్సరాలు అవుతుంది. నవ యవ్వనపు వయస్సు పదహారు సంవత్సరాలకు ఏడు సంవత్సరాలు కలిపితే ఇరవై మూడు సంవత్సరాలు అవుతుంది. ఆ విధంగా పురుషుల సరైన పెండ్లి వయస్సు ఇరవై మూడు సంవత్సరాలు అవుతుంది. చివరి ప్రవక్త ముహమ్మద్(స) గారి ప్రవర్తనను చూసినట్లయితే, ఈ వయస్సుకు మరో రెండు సంవత్సరాలు పెంచిన పెండ్లి వయస్సు ఇరవై అయిదు సంవత్సరాలు అవుతుంది.

మహనీయులు ముహమ్మద్(స) గారి మొదటి వివాహం హజ్రత్ ఖతీజా (రజి) గారితో ఇదే వయస్సు (25సంవత్సరాలు)లో జరిగింది. ఆయన (స) పెండ్లి దైవదౌత్యానికి ముందు అన్నది వాస్తవం. అయితే ప్రవక్తల ప్రవర్తనా తీరు, వ్యవహారశైలి చిన్నప్పటినుండే ఎంతో ఉన్నతంగా, ఆదర్శంగా ఉంటుంది. దైవదౌత్యానికి ముందు కూడా వీరి జీవితాలలో ఆదర్శమైన నమూనా ఉట్టిపడుతుంది. ఇక మహనీయులు ముహమ్మద్(స) గురించి చెప్పాల్సిన అవసరమేలేదు. ఆయన(స) ప్రవక్తలందరిలో ప్రముఖుడు. అందరి మేలును కోరే ఇమామ్ కూడాను.

## సామర్థ్యం, దాని ఆవశ్యకత

హదీసులో ఆలోచించదగ్గ మూడవ అంశం 'సామర్థ్యం' యువకుల సంఘాన్ని ఉద్దేశించి ప్రసంగించిన అంశం. శక్తిసామర్థ్యాలు గలవారు పెండ్లి విషయంలో ఆలస్యం చెయ్యరాదు ఎవరైతే నికాహ్ సామాగ్రి, సంభోగపు శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటాడో అతను వివాహం చేసుకోవాలి. అతనిపై నికాహ్ విధి అయినా శక్తిసామర్థ్యాలు లేకపోతే అతను నఫిల్ రోజా (అదనపు ఉపవాసవ్రతం) పాటించడం తప్పనిసరి. ఎందుకంటే అది మనిషి కామవాంఛను దూరం చేస్తుంది. ఇంకా ఆడవారిపై మనసు కలగకుండా చేస్తుంది.

పెండ్లికి అసలైన ఆటంకం ఆర్థికపరమైన వనరులే. ఇలాంటి పరిస్థితులలో నఫిల్ ఉపవాసాల వల్ల మానసిక కోరికలకు కళ్ళెం వెయ్యమని

ఆదేశించడం జరిగింది. ఉదాహరణకు ఈ ప్రవచనంలో మహనీయులు ముహమ్మద్(స) ఇలా తెలిపారు.

మీలో ఆర్థికపరమైన స్థోమతగలవారు పెండ్లి చేసుకోవాలి. అది చూపును వాల్చి, మర్మాంగాలను భద్రంగా ఉంచగలిగే చక్కని మార్గం. అలా చెయ్యలేనివారు నఫిల్ ఉపవాసాలు పాటించి మానసిక కోరికలకు కళ్ళెం వేయవచ్చు.

అదేవిధంగా హజ్రత్ ఆయిషా సిద్దిఖా(రజి) ఉల్లేఖించారు. మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు.

నికాహ్ నా సంప్రదాయం. ఎవరైతే నా సంప్రదాయాన్ని ఇష్టపడరో వారితో నాకు ఎలాంటి సంబంధం ఉండదు. మీరు పెండ్లి చేసుకోండి. ఎందుకంటే ఇతర సమాజంతో పోలిస్తే నా సమాజపు ఔన్నత్యం, ఆధిక్యతను నేను ప్రదర్శించగలను. మీలో ఆర్థిక స్థోమతగల వారు నికాహ్ చేసుకోండి. లేనివారు నఫిల్ ఉపవాసాలు పాటిస్తూ ఉండటం తప్పనిసరి. మనిషి కామ వాంఛను విచ్ఛిన్నం చేసే ధర్మసమ్మతమైన సాధనం 'ఉపవాసం'

మూడురకాల వ్యక్తులకు అల్లాహ్ సహాయం తప్పకుండా ఉంటుంది. 1) అల్లాహ్ మార్గంలో జిహాద్ చేసేవారు 2) బడిఈడు బానిస కోసం తమ ఆర్థిక సహాయాన్ని వెచ్చించేవారు. 3) పెండ్లి ద్వారా పరిశుద్ధతను కోరుకునే వ్యక్తి.

ఈ ప్రవచనంలో అల్లాహ్ వైపు నుండి ఏ మూడు రకాల వ్యక్తుల సహాయం గురించి ప్రస్తావన వచ్చిందో, వారి సంబంధం ఆర్థిక బలహీనత, ఆర్థిక కొరతతో ముడిపడి ఉంది. ఈ ప్రవచనం చివరలో తెలిపిన విషయాన్ని దివ్యఖుర్ఆన్‌లో ఇంకా ఎక్కువగా విడమర్చి తెలుపడం జరిగింది.

వివాహ అవకాశాన్ని ఇంకా పొందనివారు శీలశుద్ధతను పాటించాలి. అల్లాహ్ తన అనుగ్రహం ద్వారా వారికి కలిమి ఇచ్చేవరకు.

ఈ వాక్యంలోని ఆజ్ఞ 'శీలశుద్ధత' కొరకు ఇతోధికంగా నఫిల్ ఉపవాసా లను ఆచరించాలని హదీసు వివరణలో తెలుపబడింది. దీనివల్ల కామవాంఛను ఛేదించడం సులభమవుతుంది. 'అల్లాహ్ తన అనుగ్రహం ద్వారా కలిమి ఇచ్చేవరకు' అనే వాక్యం ద్వారా తెలిసే విషయం ఏమిటంటే పెండ్లికి ఆటంకమయ్యేది ముఖ్యంగా ఆర్థికపరమైన ఇబ్బందులేనని తెలుస్తుంది. ఈ విధంగా ముస్లిం పురుషులు, యువకులు తమ ఆర్థిక పరిస్థితులు స్థిరపడనంత వరకు పెండ్లి ఆలస్యం చేయవచ్చు. పెళ్ళయ్యే వరకు పరిశుద్ధత, సౌశీల్యముతో గడపాలి. ఈ విషయమై ఇతోధిక నఫిల్ ఉపవాసాలు ఎంతగానో ఉపయోగ పడతాయి. అసలు విషయం ఏమిటంటే పెండ్లి చేసుకునే విషయంలో పరి స్థితులు అనుకూలించకపోతే తొందరపాటు చెయ్యరాదు. ఉన్న పరిస్థితులలోనే పని చెయ్యాలి. రాబోవు కాలంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉండకుండా ప్రశాంత జీవితం గడపడానికి ఏదో ఒక పని తప్పక ఉండాలి. వ్యాపారం, ఉద్యోగం, వ్యవసాయం అది ఏదయినా సరే వాటిద్వారా ఆదాయం రావాలి. వీలయినంతవరకు అది స్థిరమైనది కావాలి. తద్వారా మనిషి తన కాళ్ళపై తాను నిలబడగలడు. ప్రస్తుత కాలంలో అధిక మంది జీవన మార్గం ఏదో ఒక పని పాట లేదా ఉద్యోగం. ఉద్యోగం కోసం విద్య తప్పనిసరి. అది పదిపన్నెండేళ్ళ వయస్సులో పూర్తి కాదు. ఇంకా ఏదయినా ఒక పనిపాట గురించి ఆ వయస్సులో సరైన ఆలోచన కూడా రాదు. అబ్బాయి చదువులో నిమగ్నమై ఉండీ, లేదా ఏదయినా పని నేర్చుకుంటూ ఉండి, లేదా దానిని స్థిరపపరుచు కుంటూ ఉంటే వాటిని నెరవేర్చకుండా పెండ్లి చేసుకోవడం సమంజసం కాదు. యుక్త వయస్సు ముప్పై సంవత్సరాల వరకు కాబట్టి ఇరవై, ఇరవై రెండు సంవత్సరాలలో కూడా మరోరెండు సంవత్సరాలను పెంచుకోవచ్చు. ఇలా చేయడం వల్ల అల్లాహ్ ఆదేశాలకు, హదీసు వచనాలకు ఎలాంటి భంగం కలగదు. అల్లాహ్ ఆదేశానుసారం ఇహలోకపు ఉన్నత లక్ష్యాలు, పరలోకపు

సాఫల్యం కోసం యువత పెండ్లి విషయంలో ఆలస్యం చెయ్యడానికి హదీసు దృష్ట్యా పూర్తి అవకాశం ఉంది. అంతేకాదు అనేక పరిస్థితులలో ఈ విషయమే సరైనది, సమంజసమైనదికూడాను. ఒకవేళ మనిషి తన కామవాంఛను అదుపు చేయలేకపోయి, తప్పుడు మార్గంలో పయనించే అవకాశం ఉంటే, వేరే అన్ని విషయాలను త్యాగం చేసి వెంటనే పెండ్లి చేసుకోవడం అతనికి వాజిబ్ అవుతుంది. ధర్మశాస్త్రజ్ఞులు ఈ విషయమై అనేక వివరణలు ఇచ్చారు.

అనేక ప్రవచనాల ద్వారా ప్రాజ్ఞత గల వయస్సులోనే పెండ్లి సమంజసమని తెలుస్తుంది

పెండ్లికి సంబంధించి మహనీయులు ముహమ్మద్(స) గారి అనేక ప్రవచనాల ద్వారా తెలిసే విషయం ఏమిటంటే పెండ్లి అనేది చిన్న వయసులో, యుక్తవయస్సుకు పూర్వం కాకుండా ప్రాజ్ఞత పొందిన వయస్సులోనే సమంజసమని తెలుస్తుంది. బుఖారి, ముస్లిం గ్రంథాలలో ఇలా ఉంది. హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు. ప్రవక్త(స) ఇలా తెలిపారు.

"స్త్రీని నాలుగు ప్రాతిపదికలపై పెండ్లి చేసుకుంటారు. ఆమె ఐశ్వర్యాన్ని చూసి, ఆమె వంశ ప్రాశస్త్యాన్ని చూసి, ఆమె అందచందాలు చూసి, ఆమె ధార్మిక స్థితి చూసి. మీరు ధార్మికురాలైన స్త్రీని ఎన్నుకోండి, మీకు మేలు కలుగుతుంది.

ఆయనదే మరో ఉల్లేఖనం. మహనీయులు ముహమ్మద్(స) ఇలా తెలిపారు.

"మీ వద్దకు పెండ్లి సంబంధం వచ్చినప్పుడు, ఆ వ్యక్తి ధర్మపరాయణత, గుణగణాలు మీకు నచ్చినట్లయితే అతనితో పెండ్లి జరిపించండి. మీరలా చేయకపోతే ధరణిలో అధర్మం చెలరేగుతుంది. గొప్ప కల్లోలిత పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.

....బుద్ధీజ్ఞానాలు, ప్రాజ్ఞతగల ఈడులో పెండ్లి జరిగినప్పుడే మనిషి ఈ ఉపదేశాలను అర్థం చేసుకొని వాటిని ఆచరించగలడు. ఆయన(స) తెలిపిన

ప్రవచనాలకు అప్పుడే సరియైన అర్థం చేకూరుతుంది. భార్యతో సంయోగం, ఆమె హక్కుల విషయంలో ఆయన (స) తెలిపిన ఉపదేశాల కొరకు కూడా ప్రాజ్ఞత అనుభవాలు తప్పనిసరి. ఆయన (స) తెలిపిన ఉపదేశాలు మనిషి జీవితంలోని అన్ని రంగాలకు సంబంధించినవి.

## 9. చివరిమాట

అబ్బాయి, అమ్మాయి పెండ్లిండ్లను చిన్న వయస్సు, యుక్తవయస్సుకు పూర్వమే చేసి, వారిని ఒక ఇంటివారుగా చేసివేస్తే తమ బాధ్యత తీరిపోయినట్లు కుటుంబం, సమాజంలోని వారు తలపోస్తున్నారు. అన్ని నియమనిబంధనలను తుంగలో తొక్కేసి చిన్న వయస్సు అమ్మాయిని అత్తారింటికి పంపించి వేయడం జరుగుతోంది. పెండ్లి అనేది యుక్త వయస్సు, బుద్ధీజ్ఞానాల పటిష్టత తరువాతే జరపడం సమంజసం.